# పాపం విక్రమార్కుడు

ఈ సారి నేనొచ్చిన పని అనుకున్న దానికంటే ముందే పూర్తికావడంతో వెళ్తూ వెళ్తూ చెల్లాయిని చూసి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను.

విద్య ఎప్పుడూ పోరుతూ వుంటుంది, నా బిజినెస్ గొడవల్లో పడి నేను బంధాలన్నీ తెంచుకుంటున్నానని. నిజమే... నానాటికీ పోటీ పెరిగిపోతూన్న ఈ వ్యాపార రంగంలో అడుగడుగునా కసాయితనం కన్పిస్తూన్నా తానీనాడు ఇంత ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కారణం తన నిరంతర కృషే, పట్టుదలా అని చెప్పక తప్పదు.

ఏ రంగంలోనైనా మనిషి విజయం సాధించాలంటే స్థిరమైన ధ్యేయం, ఆపైన నిరంతర కృషీ చాలా అవసరం... శ్రమ లేనిదే ఏదీ మనకు అయాచితంగా లభ్యం కాదు.

"ఇఫ్ వియ్ వాంట్ టు గెయిన్ సమ్‌థింగ్ వియ్ మస్ట్ లూజ్ సమ్‌థింగ్" ... నిజమే కదా.

అయితే మనిషి ఆశయ సాధన కోసం వ్యక్తిగత జీవితాన్ని బలి చేసుకోవలసిన అవసరం లేదని నా ఉద్దేశం... కానీ ఆ కంపార్ట్‌మెంటలిజమ్, అంతటి సాధనా ప్రతీవారికీ సాధ్యమౌతుందని నేననుకోను. అందుకే చాలామంది పబ్లిక్ ఫిగర్స్‌కి పర్సనల్ లైఫ్ ఎంజాయ్ చేసే తీరిక వుండదు.

ఆలోచనలోనే విద్యా వాళ్ళ ఊరు చేరుకున్నాను.

"రండి... రండి బావగారూ... చిరకాల దర్శనం" అంటూ మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు ప్రతాప్. అతడు స్టేట్ బ్యాంక్‌లో ఫీల్డాఫీసరు. జీవితాన్ని అద్భుతంగా అనుభవిస్తోన్న ప్రాక్టికల్ మేన్.

చెల్లినీ, పిల్లల్నీ ప్రాణంలా చూసుకుంటాడు. అందుకే విద్యని గురించి పట్టించుకునే అవసరం నాకు లేకపోయిందనుకుంటాను.

"ఏంట్రా అన్నాయ్! ఆలోచనలో పడిపోయావు? ఇన్నాళ్ళ తర్వాత గుర్తొచ్చేనేంటి?" తన సహజ ధోరణిలో విష్కరమాడింది విద్య.

పిల్లలిద్దరూ నేనొచ్చిన సంతోషాన్ని, ఉద్వేగాన్ని ఆపుకోలేకపోతున్నారు. "మామయ్యా" అంటూ వాళ్ళస్కూలు విశేషాలు పోటీపడి చెప్పసాగారు. వాళ్ళ కబుర్లు వింటూ వుండగానే భోజనాలు వడ్డించేసింది చెల్లాయి.

అలసిపోయి వుండడంతో భోజనం చేసి పడకేశాను.




నాలుగింటికి లేచి "ఇక బయల్దేర్తాను" అంటే నా మీద పడి కొట్టేనంత పనిచేసింది విద్య.

"భలేవారు బావగారూ... అసలెంత కాలమైంది మీరు ఇటు వచ్చి. ఇవ్వాళుండి వెళ్ళాల్సిందే" పట్టుబట్టాడు ప్రతాప్.

కాఫీలయ్యాక—

"అలా బయటికెళ్ళొద్దాం పదండి" అంటూ బయల్దేరదీశాడు.

నాకు మాత్రం ఎక్కడికీ వెళ్ళాలని లేదు. కూర్చుని విద్యతో కబుర్లు చెప్పుకోవాలని వుంది. కానీ ఈ ప్రశాంత వాతావరణంలో ఓసారి బయటికెళ్ళి అనుభూతించాలని కూడా అన్పించి అతడితో కలిసి బయటకి నడిచాను.

ఊరంతా త్రిప్పి చూపించాడు.

"ఏంటి బావగారూ చాలా సంతోషంగా కన్పిస్తున్నారు" ప్రశ్నించాడు ప్రతాప్.

"చాలా రోజుల తర్వాత ఇలా తీరిగ్గా మీతో కలిసి బయట తిరగడం ఎంతో రిలీఫ్‌గా వుంది ప్రతాప్."

"అవునండీ నిముషాలతో పోటీ పడే మీలాటి వ్యాపారవేత్తలకి అప్పుడప్పుడూ ఇలాటి మార్పనేది కావాలండీ... లేదంటే మరీ యాంత్రికంగా తయారౌతుంది జీవితం."

తిరిగి వస్తోండగా పార్కులో ఓ ప్రక్కగా కూర్చున్న ఆ వ్యక్తి మీద పడింది నా దృష్టి... అతడు బిచ్చగాడిలా కన్పిస్తున్నాడు. ఆశ్చర్యపోయాన్నేను.

అడుక్కుంటోన్న బిచ్చగాళ్ళని చూసి ఆశ్చర్యపోవడానికి నేనేమీ ఫారిన్ కంట్రీలో లేను. అక్షరాలా ఆంధ్రప్రదేశ్‌లోనే వున్నాను.

నేనింతగా ఆశ్చర్యపోవడానికి కారణం —

ఎముకల పోగులా వున్న అతడి ముందో పళ్ళెం. దాంతో పాటే ఓ తెరిచి వున్న పుస్తకం. ఆ పుస్తకంలోని విషయాన్ని అతడు చెక్కిట చేయి చేర్చి చదువుతోన్న విధానం నిజంగా నన్ను ఆశ్చర్యంలో ముంచి తేల్చింది. అంత నిశితంగా ప్రక్కనేం జరుగుతోంది కూడా పట్టించుకోకుండా అతడేం చదువుతున్నాడు?

ప్రశ్నార్థకంగా బావగారి వైపు చూశాను.

నవ్వాడు ప్రతాప్.

"మీరు అతడిని బిచ్చగాడిలా అనుకుని వుంటే పొరపడినట్లే. పూర్వాశ్రమంలో అతడో రచయిత. పదహారో ఏట నుంచీ అతడు వ్రాస్తూనే వున్నాడు పుంఖాను పుంఖాలుగా. ఎన్నో కథలూ, నవలలూ, కవితలూ అలా వ్రాశాడు కానీ ఒక్కటంటే ఒక్కటి కూడా సూపర్ హిట్ కాలేదు. అసలు అచ్చుని చూసినవి కూడా చాలా తక్కువ.

అయినా పట్టువదలని విక్రమార్కుడిలా వ్రాస్తూనే వుండేవాడు. ఏదో ఒక సబ్జెక్ట్‌ని తీసుకుని పరిశోధించి, పరిశీలించి మేటర్ సేకరించి లేదా వీలైతే పరాయి భాషల్నుండి కాపీ చేసే ఈ ఇన్వెస్టిగేటివ్ రచనా యుగంలో అత్యంత సాధారణంగా సామాజిక సమస్యల గురించీ, వాస్తవిక జీవితాల గురించీ, మానవ సంబంధాల గురించీ లోతుల దాకా కొలిచి జీవితపు విలువల్ని తెలియజెప్పాలనే తాపత్రయంతో వచ్చిన అతడి రచనలు పాఠకులకి నచ్చలేదు."

"ఎందుకని...?" అడ్డుతగిలాన్నేను.

"చెప్పాను కదా షుగర్ కోటెడ్ పిల్స్‌లా ఇన్వెస్టిగేటివ్ నవలలు వారిని ఆకర్షించాయి కాబట్టి.

పాఠకుల నాడిని గుర్తెరిగి మేము ప్రచురించాలంటారు ఎడిటర్స్. మీరు ప్రచురణకి స్వీక

రిస్తున్నారు కాబట్టి మేము వ్రాస్తున్నామంటారు రచయితలు. మీరు పబ్లిష్ చేసేదేదో చదవక ఛస్తామా అంటారు పాఠకులు. ఇదో విష వలయం. ఎక్కడికక్కడ మనీ మేకింగ్ ముఖ్య ధ్యేయంగా కన్పిస్తూంది.

ఈ మధ్యన మరీ నిర్భయంగా కనీస వివరణ కూడా ఇవ్వకుండా మక్కీకి మక్కీ కాపీ చేసేస్తున్నారు కొంతమంది.''

''మరి అలా కాపీ చేస్తే పాఠకులకు తెలిసిపోదూ'' సాహిత్యంతో ఏ మాత్రం పరిచయం లేని నేను అమాయకంగా ప్రశ్నించాను.

''తెలుసుకోవడం చాలా కష్టం బావగారూ! ఎందుకంటే సగటు తెలుగు పాఠకుడికి ఆంగ్ల సాహిత్యంతో పరిచయం చాలా తక్కువ. ఆంగ్ల సాహిత్యాభిలాషులు ఈ సోకాల్డ్ తెలుగు నవలల్ని చదివి సమయం వృథా చేసుకోవాలని అనుకోరు. ఒక వేళ ఒకరూ, ఇద్దరూ గుర్తెరిగి ఘోషించినా ఎవరూ పట్టించుకోరు''. అతి సాధారణమైన విషయంలా చెప్పేసి నవ్వాడు ప్రతాప్.

నాకు మాత్రం ఇదంతా వింతగా, ఆశ్చర్యంగా తోస్తోంది.

అతడి వైపు తిరిగాను విస్మయంగా.

మళ్ళీ తనే చెప్పాడు ప్రతాప్. నా ఆశ్చర్యాన్ని గమనించి.

''మానవ జీవితాల్ని, సంబంధాల్నీ వివరించాలని ప్రయత్నించి ఈ సమాజం తిప్పికొట్టడంతో అతడికి మతిభ్రమించింది... మళ్ళీ ఎవరి జోలికీ వెళ్ళడు. ఎవరైనా దయతలచి పెడితే తింటాడు. లేదంటే అలానే వుంటాడు ఎన్ని రోజులైనా.

పలకరిస్తే చాలు —

''ఇన్ఫర్మేషన్ సేకరిస్తున్నానండీ... ఈసారి తప్పకుండా నా నవల అచ్చవుతుంది... అచ్చవుతుంది... అంటూ అరుస్తాడు బిగ్గరగా.''

''అతడి కెవరూ లేరా?''

''లేరు. జీవితమంతా సాహిత్యాభిలాషలోనే గడిపివేశాడు.''

ప్రతాప్ చెప్పిన కథంతా విన్న తర్వాత ఆ వ్యక్తి మీద కాదు కానీ, తెలుగు సాహిత్యం మీద, ఈ వ్యాపారాత్మక నవలలని లావిష్‌గా పోషిస్తోన్న తెలుగు పాఠకుల మీదా జాలి కలిగింది నాకు.

ఇన్నాళ్ళూ సాహితీ పఠనానికి తీరికలేదని వాపోయేవాడిని.

ఇక ముందు నాకా బాధ లేదు.

# సినిమా క్విజ్

ప్రతి నెలా పాఠకుల కోసం సినిమాకు సంబంధించిన ఒక క్విజ్‌ను నిర్వహిస్తున్నాము. ఈ క్విజ్‌లో విజేతలకు నెల నెలా రు. 50/-లు బహుమతిగా అందజేస్తాము. విజేతలు ఒకరికన్నా ఎక్కువ మంది వుంటే లాటరీ పద్ధతిలో లక్కీ నెంబర్ డ్రా తీసి, అలా గెలుపొందినవారికి బహుమతి సొమ్ము అందజేయడం జరుగుతుంది.

కార్డుపైన 'సినిమా క్విజ్', ఎడిటర్, 'వనితాజ్యోతి' ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, లబ్బీపేట, విజయవాడ - 520 010 చిరునామాకు పంపాలి.

ఈ ఫోటోలోని ప్రముఖ హిందీ నటి ఎవరు? మీ సమాధానాలు ఈ క్రింది కూపన్‌లో వ్రాసి, దానిని కత్తిరించి ఒక పోస్ట్ కార్డుపై అంటించి మా చిరునామాకు మే 10వ తేదీలోగా అందేలా పంపండి.



**సినిమా క్విజ్/ఎవరు?**

నటి పేరు ..........................................

పంపిన వారి పేరు ..................................

చిరునామా ..........................................

..........................................................

..........................................................

**సినిమా క్విజ్ ఫలితం**

ఏప్రిల్ నెల క్విజ్

సమాధానం:

నటి పేరు: కమలా లక్ష్మణ్

ఆల్ కరెక్టుగా వ్రాసినవారిలో లక్కీ డ్రా తీయగా విజేతగా డి. భాగ్యలక్ష్మి, W/o. డి.సి.హెచ్.వి.ఆర్. రావు, పి.డబ్ల్యు.ఐ. S.E. Rly, నౌపాడర్ (3) (శ్రీకాకుళం జిల్లా) ఎన్నికయ్యారు. వీరికి బహుమతి సొమ్ము త్వరలో అందజేస్తాము.

- ఎడిటర్

## సౌధాల్లో సరంజామా

ఏ పని చేసినా అందంగా చేయడంలోనే ఆనందముంటుంది. ధనియాలు, శొంఠి, అల్లం, సాంబారుపొడి, మెంతులు, ఆవాలు ఇలా ఇల్లాలి వంట సరంజామాను చిన్న చిన్న సౌధాల్లో నిల్వచేయడం ఒక సరదాగా వుండదూ!... రాయల్ పేలస్‌లోంచి రాతి ఉప్పు చిటెకుడు తీస్తే సరదాగా వుంటుంది. స్వప్న సౌధంలోంచి 'సోప్' తీసుకుంటే భలేగా వుంటుంది. ఇలాంటి ఆలోచనలు రాగానే ఒక ప్రముఖ పోర్సిలిన్ కంపెనీ సౌధాల ఆకారాల్లో పింగాణీ జాడీలను తయారుచేయించింది. వీటిగురించి ఎడ్వర్టైజమెంట్ రాగానే ఈ సౌధాలను అతి చవకగా సొంతం చేసుకోవడానికి గృహిణులు ఎగబడ్డారు అమెరికాలో. 'లినాక్స్ స్పైస్ విలేజి'గా పేరొందిన ఈ సౌధాల సౌందర్యం చిత్రంలో చూడండి. 24 జాడీల సెట్టు 388 డాలర్లట! (6,984 రూపాయలు)

- గాయత్రి

